# స్వర్గారోహణపర్వ కథాంశాలు

స్వర్గారోహణ పర్వములో ఐదు అధ్యాయములు, 213 శ్లోకములు కలవు.

**మొదటి అధ్యాయము-** స్వర్గమున నారదయుధిష్ఠిరుల సంభాషణ:--

స్వర్గలోకము చేరిన ధర్మరాజు దేవతలు సాధుగణముతో కూడా సింహాసనమును అలంకరించిన దుర్యోధనుని చూచిరి. అతడు వీరోచిత శోభతో సూర్యునివలె ప్రకాశించుచుండెను. దుర్యోధనుని ఇంతటి ఉన్నతస్థితిని చూచి కోపగించి యుధిష్ఠిరుడు అచటినుండి బయటకు వచ్చి గట్టిగా ఇట్లు పలికెను. దేవతలారా! ఎవరి కారణముచే మిత్రులను బంధువులను యుద్ధమున చంపితిమో, వనవాసమున కష్టములను అనుభవించితిమో, ఎవరి వలన ద్రౌపది అవమానములపాలైనదో అటువంటి వానితో ఉంటూ పుణ్యలోకములను పొందుట నాకు ఇష్టము లేదు. అతని ముఖముకూడా నేను చూడదలచుకోలేదు. నా సోదరులు ఉన్నచోటికే నేను కూడా వెళ్ళుదలచుకున్నాను. అతని మాటలు విని చిరునవ్వుతో నారదుడు రాజా! దుర్యోధనుని గూర్చి ఈ విధముగా పలుకుట నీకు తగదు. వీరగతిని పొంది చిరకాలమునుండి స్వర్గలోకమున నివసించుచున్నాడు. ఇది స్వర్గలోకము. భూలోకమున జరిగిన విషయములను ఇచ్చట స్మరించుట ఉచితము కాదు. దుర్యోధనునితో న్యాయపూర్వకంగా కలువుము. ఇచ్చట పూర్వవిరోధములు ఉండవని చెప్పెను. యుధిష్ఠిరుడు తన సోదరుల సమాచారమును అడుగుచు ఇట్లు పలికెను. పాపి అయిన దుర్యోధనునికే ఇంతటి ఉత్తమ లోకము లభించిన సత్యవాదులయిన నా సోదరులు ఎటువంటి లోకములు పొందినారో గదా! నేను వారిని చూడదలచుకున్నాను. మహాత్ముడైన కర్ణుని కలవాలని అనుకొనుచున్నాను. ధృష్టద్యుమ్నుడు అతని పుత్రులు, అట్లే సాత్యకిని చూడవలెనని అనుకొనుచున్నాను. యుద్ధమున మరణించిన రాజులను, అభిమన్యుని కలిసెదను.

**రెండవ అధ్యాయము**:-- యుధిష్ఠిరునకు నరకము చూపించుట. సోదరుల ఆక్రందన విని అచ్చటే ఉండుటకు ధర్మరాజు నిశ్చయించుట:--

యుధిష్ఠిరుడు కర్ణునితో కుడా తన సోదరులను చూడదలచి అతడు దేవగణముతో ఇట్లు పలికెను. ఎచ్చట నాసోదరులు ఉన్నారో అదే నాకు స్వర్గము. ఇది నాకు స్వర్గము కాదు. యుధిష్ఠిరుని కోరికను అనుసరించి దేవగణము అతని సోదరులను చూపించుటకు దేవదూతను ఆజ్ఞాపించెను. దేవదూత అతనిని భీమసేనాదులు గల ప్రదేశమువైపు తీసుకొని వెళ్లెను. అది ప్రవేశించుటకు శక్యముకానిది, అశుభమయినది. ఆ ప్రదేశమున పాపాత్ములు నివసించెదరు అది ఘోరమగు అంధకారముతో ఆవరించి యుండెను. రక్తమాంసములతో నిండియుండుటచే అచ్చట దుర్గంధము వ్యాపించి యున్నది. ఎముకలు, కేశములు, క్రిమికీటకములతో అమార్గమంతా నిండి ఉన్నది. అగ్నిజ్వాలలు నాల్గువైపులా వ్యాపించి ఉన్నవి. లోహముఖము కల కాకులు, గ్రద్దలు, పక్షులు, ప్రేతశరీరములు ఇటు అటు తిరుగుచున్నవి. యుధిష్ఠిరుడు తనలోతాను ఆలోచిస్తూ అమంగళమగు మార్గముద్వారా ముందుకు సాగెను. ముందుకు వెళ్ళి అతడు వేడి నీటితో నిండిన ఒక నదిని చూచెను. దానిని దాటుట చాలకష్టము. రెండవ వైపు కత్తులే ఆకులుగా కల అసిపత్రము అను వనము కలదు. అక్కడ అక్కడ మార్గమున బాగా కాల్చబడిన లోహశిలలు ఉంచబడినవి. నాల్గువైపుల లోహపాత్రలలో నూనె ఉడికించబడుచున్నది. పాపము చేసినవారు ఇచ్చట యాతనలను అనుభవించవలెనని యుధిష్ఠిరుడు తలపోసెను. అతడు దేవదూతను మనము ఇంకా ఎంతదూరము పోవలెను. నా సోదరులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించెను. ధర్మరాజు మాటలు విని దేవదూత వెనుదిరిగి అతనితో ఇంతవరకే మీరు రావలసినదని పలికెను. దుర్గంధమును భరింపలేక యుధిష్ఠిరుడు వెనుకకు వెళ్ళుటకు నిశ్చయించెను. వెనుకకు మరలిన సమయమున యుధిష్ఠిరునకు దీనుల ఆర్తనాదములు వినిపించెను. ధర్మాత్మా! కొంతసమయము మీరు ఇక్కడ ఉండుడు. ఇచ్చట మీరు ఉండుటవలన మాకు ఇచ్చటి యాతనలు కష్టమును కలిగించుట లేదు. వారి ఆర్తనాదములు విని యుధిష్ఠిరుడు నిలబడి "మీరు ఎవరు? ఎందువలన ఇచ్చట ఉన్నా"రని ప్రశ్నించెను. అపుడు నాల్గుగు వైపులనుండి నేను కర్ణుడను,నేను భీమసేనుడను, నేను అర్జునుడను, నేను నకులుడను, నేను సహదేవుడను, నేను ధృష్టద్యుమ్నుడను, నేను ద్రౌపదిని అని వినిపించెను. వారి దురవస్థలను, పాపియగు దుర్యోధనుని భోగమును తలచి

యుధిష్ఠిరుడు చింతించుచు దేవతలను, ధర్మదేవతను నిందించెను. అతడు దేవదూతతో నీవు ఎవరికి దూతవో వారివద్దకే వెళ్ళుము. నేను అచ్చటకు రాను ఇక్కడనే ఉండెదను. ఇక్కడ ఉండుటవలన  నా సోదరులకు, బంధువులకు సుఖము లభించుచున్నదని చెప్పెను. దేవదూత ఇంద్రుని వద్దకువెళ్ళి ధర్మరాజు చెప్పిన మాటలను వినిపించెను.

**మూడవ అధ్యాయము:-** ఇంద్రుడు, ధర్మదేవత ఇద్దరు యుధిష్ఠిరుని ఒప్పించుట-

యుధిష్ఠిరుని కలియుటకు ఇంద్రుడు, శరీరధారి యగు ధర్మదేవత ఇద్దరు అతని
దగ్గరకు వచ్చిరి. ప్రకాశించెడి శరీరముగల దేవతలు ఇద్దరు అక్కడకు వచ్చుసరికి అచ్చటి అంధకారం తొలగిపోయెను. పాపపురుషుల యాతనలు అదృశ్యమయ్యెను. అచ్చట నరక వాతావరణము కనిపించుటలేదు. ఇంద్రునితో కూడా మరుద్గణము, ఋషిగణము అక్కడకు వచ్చెను. యుధిష్ఠిరుని సముదాయించుచూ ఇంద్రుడు తాత! నా మాట వినుము రాజులందరు తప్పక నరకము చూడవలెను. ప్రతి మనుషునకు శుభ అశుభ కర్మలకు సంబంధించి రెండు ఫలములు ఉండును. మొదట అశుభ కర్మ ఫలము అనుభవించిన పిమ్మట స్వర్గము చేరును ఎవరు పాపకర్మలను ఎక్కువగా చేయుదురో వారు మొదట శుభ ఫలములు అనుభవించుటకు స్వర్గము చేరుదురు. రాజా! నీ సోదరులు పాప ఫలమును అనుభవించి స్వర్గము చేరినారు వారిని చూచి నీ మనోవ్యధను దూరము చేసుకొనుము. ధర్మదేవత ధర్మరాజుతో హేపుత్ర! నీవు అన్ని పరీక్షలలోను నెగ్గినావు. నీలో పాపము అణువంతయు లేదు. నీ సోదరులు నరకమున ఉండువారు కాదు. ఇదంతయు ఇంద్రుని మాయ. రాజులందరు తప్పక నరకమును చూడవలెను కనుక నీవు రెండుఘడియలు దుఃఖమును పొందితివి అని పలికెను. ధర్మదేవత సూచనప్రకారం యుధిష్ఠిరుడు దేవనది గంగలో స్నానం చేసి వెంటనే మానవశరీరమును విడిచి ధర్మదేవతతో పాండవులు, ధృతరాష్ట్ర పుత్రులు ఉండు ప్రదేశమునకు వెళ్ళెను.

**నాల్గవ అధ్యాయము:-** దివ్యలోకమున యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుడు, అర్జునుడు మున్నగు వారిని చూచుట.

దివ్యలోకమున యుధిష్ఠిరుడు దివ్యవిగ్రహ సంపన్నుడగు శ్రీకృష్ణుని చూచెను. అర్జునుడు భగవంతుని ఆరాధించుచుండెను వారు ఇద్దరు యుధిష్ఠిరుని యథోచితంగా గౌరవించిరి. రెండవ వైపున సూర్యుని వలె ప్రకాశించెడి కర్ణుని, వాయుదేవుని వద్ద కూర్చున్న భీమసేనుని, అశ్విని కుమారుల స్థానమున కూర్చున్న నకుల, సహదేవులను, పద్మమాలతో అలంకృతమైన ద్రౌపదిని యుధిష్ఠిరుడు చూచెను. ఇంద్రుడు స్వయంగా అందరిని పరిచయంచేసెను. అతడు యుధిష్ఠిరునితో సాక్షాత్తు లక్ష్మీదేవియే ద్రౌపదిగా అవతరించినదని చెప్పెను. అతడు ఇతర రాజులను కూడా పరిచయము చేసెను. ధృతరాష్ట్ర, పాండు, భీష్మ, ద్రోణాది మహాపురుషులను కూడా చూపించెను.

**ఐదవ అధ్యాయము:-** మహాభారతం ఉపసంహారం, మాహాత్మ్యము

జనమేజయుడు, వైశంపాయనుని భీష్ముడు, ద్రోణుడు, ధృతరాష్ట్రుడు, విరాటుడు,

మున్నగువారు స్వర్గలోకమున ఎంతకాలము ఉన్నారు? వారికి ఎటువంటి గతి లభించినది అని అడిగెను. ఈ సందర్భమున వ్యాసమహర్షి చెప్పిన దానిని వైశంపాయునుడు వినిపించెను. వీరులందరు కర్మఫలమును అనుభవించిన పిమ్మట తమ తమ మూలస్వరూపంలో కలసిపోయారు. భీష్ముడు వసువుల రూపంలో ద్రోణుడు బృహస్పతి రూపంలో, కృతవర్మ మరుద్గణములో ప్రద్యుమ్నుడు సనత్ కుమార రూపంలో ప్రవేశించిరి. గాంధారితో కూడా ధృతరాష్ట్రుడు కుబేర లోకమును పొందెను. పాండురాజు రాణులతో కూడా మహేంద్రభవనమునకు వెళ్ళెను. విరాటుడు ద్రుపదుడు మున్నగువారు విశ్వేదేవతల రూపంలో కలిసిపోయిరి. అభిమన్యుడు చంద్రునిలో, కర్ణుడు సూర్యునిలో, ధృష్టద్యుమ్నుడు అగ్నిరూపంలో ప్రవేశించిరి. ధృతరాష్ట్రపుత్రులందరు స్వభావతః రాక్షసులు. క్షత్రియులుగా జన్మించి యుద్ధమున శస్త్రముల దెబ్బలచే పవిత్రులై స్వర్గమును పొందిరి. విదురుడు యుధిష్ఠిరుడు ధర్మస్వరూపంలో కలిసిరి. బలరాముడు ఆదిశేషుని అవతారము. శ్రీకృష్ణుడు నారాయణుని అవతారము. ఈ విధముగా వైశంపాయనుడు కౌరవపాండవుల చరితమును

సంపూర్ణముగా వినిపించెను. మహాభారత కథను విన్న జనమేజయునకు ఆశ్చర్యము కలిగినదని సౌతి చెప్పెను. పిమ్మట పురోహితులు జనమేజయుని యజ్ఞకర్మను సమాప్తముగావించిరి. సర్పములకు ప్రాణసంకటము నుండి విముక్తిని కలుగజేసి ఆస్తీకముని ప్రసన్నుడాయెను. యజ్ఞము సమాప్తమైన తరువాత దక్షిణలతో బ్రాహ్మణులను తృప్తిపరచి జనమేజయుడు తక్షశిలనుండి తిరిగి హస్తినాపురమునకు వెళ్ళెను. ఈ విధముగా జనమేజయుని సర్పయాగమున వైశంపాయనుడు మహాభారత ఇతిహాసమును వినిపించెను. వ్యాసవిరచితమగు ఇతి హాసము పరమపవిత్రము, ఉత్తమమైనది వ్యాసమహర్షి దివ్య దృష్టితో చూచి మహాభారత ఇతి హాసమును రచించెను. దీనిని కార్ష్ణ వేదమని కూడా అందురు. మహత్త్వము, భారవత్త్వము అనుగుణములు కల్గియుండుటచే దీనిని మహాభారతమందురు. పదు నెనిమిది పురాణములు, సంపూర్ణ ధర్మశాస్త్రము, సాంగమైన వేదములతోనూ సమానమైనది మహాభారతమని వ్యాసమహర్షి స్వయముగా చెప్పెను. మూడు సంవత్సరములలో దీనిని పూర్తిగా చెప్పెను. మహాభారతమున పేర్కొన్న చతుర్విధ పురషార్థములే అన్యత్రగలవు. దీనిలో లేనిది ఇతరత్ర లేదు. ధర్మమును ప్రచారము చేయుటకు వ్యాసమహర్షి దీనిని రచించెను.

వ్యాస భగవానుడు ఈ మహాభారత సంహితను తనకొడుకు శుకదేవునకు ఉపదేశించెను. మహాభారత రచన ద్వారా వ్యాసులవారు

"ధర్మము వలన అర్థ

కామములు సిద్ధించును. ప్రజలు ధర్మమును ఎందుకు ఆచరించరు" అని చేతులు పైకెత్తి అరుస్తున్నాను. కాని నామాటలు ఎవ్వరూ వినటం లేదు అని భారతసందేశమును వినిపించెను. మోక్ష సాధనమగు ధర్మము నిత్యము. సుఖదుఃఖములు అనిత్యము. జీవాత్మ నిత్యము. సంసారబంధము అనిత్యము. ఉపదేశరత్న భాండాగారము మహాభారతము. ఇది పంచమ వేదముగా ప్రసిద్ధము. మహాభారత ఆఖ్యానమును చదివిన మోక్షరూప పరమ పురుషార్థము లభించునని సౌతి పేర్కొనెను.

**ఇది స్వర్గారోహణపర్వ కథాంశము.**